భట్టి మాటలు విని పైసల్ పోగొట్టుకోవద్దు

అభయహస్తం డాటా సైబర్ నేరగాళ్ల చేతికి!: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): అభయహస్తం దరఖాస్తులు దుర్వినియోగం అవుతున్నాయని, దరఖాస్తుదారుల డాటా సైబర్ నేరగాళ్ల చేతికి అందే ప్రమాదం ఉన్నదని మీడియా అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పందించిన తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. డిప్యూటీ సీఎం మాటలు విని అనవసరంగా తమ డబ్బులు పోగొట్టుకోవద్దని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 'ప్రియమైన తెలంగాణ సోదర సోదరీమణులారా, ఎవరైనా మీకు పింఛను లేదా ఇల్లు లేదా 6 గ్యారంటీలలో దేనినైనా ఇస్తామని కాల్ చేస్తే ఓటీపీ లేదా ఏదైనా బ్యాంక్ వివరాలను షేర్ చేయవద్దు. డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క మాటలు విని అనవసరంగా డబ్బులు పోగొట్టుకోకండి. మీరు బీఆర్ఎస్‌కు ఓటు వేశారా లేదా అన్నదానితో సంబంధం లేకుండా.. సైబర్ క్రైమ్ చట్టాన్ని రూపొందించడంలో భాగమైన వ్యక్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను. నా మాటను తీవ్రంగా పరిగణించండి, సైబర్ నేరగాళ్ల బారిన పడకండి' అని ఎక్స్‌లో కోరారు.

ఊరంతా పంచితే రోడ్డుమీద ఉండవా?

మొదటిపేజీ తరువాయి...

జరిగితే సస్పెండ్ చేస్తామని చెప్పారు. దీంతో తప్పు జరిగిందని పరోక్షంగా అంగీకరించినట్టయ్యింది. 'సైబర్ నేరగాళ్లు అభయహస్తం దరఖాస్తుదారులకు ఫోన్ చేసి ఇల్లు కట్టిస్తామని, పెన్షన్ ఇస్తామని చెప్పున్నారా? అలా ఇస్తా అంటే మంచిదే కదా' అంటూ మరో ప్రశ్నకు వెటకారం చేశారు. దరఖాస్తుదారుల డాటా దుర్వినియోగం అవుతున్నదంటూ ప్రజలు వ్యక్తంచేస్తున్న ఆందోళనను కూడా పట్టించుకోకుండా సమాధానాలు ఇవ్వడం గమనార్హం.

అంగట్లో.. మీ ఆధార్

మొదటిపేజీ తరువాయి...

పరిధిలో రోజూ రూ.2 కోట్ల విలువైన సొమ్మును కాజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వమే ప్రజల వ్యక్తిగత వివరాలను భద్రపరచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. బయటికొస్తున్న ఘటనలు కొన్నే అయినా తెలియకుండా ఇంకెంత గందరగోళం జరుగుతున్నదోననే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

దరఖాస్తుల ఆన్‌లైన్.. గజిబిజి గందరగోళం!

దరఖాస్తుల స్వీకరణ చేపట్టిన ప్రభుత్వం.. వాటిని కంప్యూటరీకరించడంలో ఎలాంటి విధి విధానాలను జారీ చేయలేదు. చివరకు జీహెచ్ఎంసీ సైతం ఇదే బాటలో నడవడంతో ఒక్కో జోన్‌లో ఒక్కో రీతిన ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ 3,500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చింది. హయత్‌నగర్ సర్కిల్‌కు వచ్చిన 83,563 దరఖాస్తులను కంప్యూటరీకరించేందుకు 122 మంది ఆపరేటర్లను కేటాయించారు. కూకట్‌పల్లిలో ఉన్న ధర్మేందర్ ఏజెన్సీకి దరఖాస్తులను పంపడమెందుకు? పైగా వాటిని ర్యాపిడోకు ఇచ్చి తరలించారంటే అధికారుల నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గాలికిపోయిన దరఖాస్తులన్నీ తమకు చేరాయని అధికారులు ప్రకటిస్తున్నా.. దీనిని ధ్రువీకరించేదెవరు? కుత్బుల్లాపూర్ పరిధిలోనూ మంగళవారం బయటికొచ్చిన వీడియోలు అందరినీ మరింత విస్మయానికి గురిచేశాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు, విద్యార్థులు సర్కిల్ కార్యాలయం నుంచి వంద చొప్పున దరఖాస్తులను కట్టలు కట్టుకొని తమ ఇండ్లకు తీసుకుపోతున్న దృశ్యాలు కనిపించాయి. ఇదేమంటే తాము ఇంట్లోనే కంప్యూటరీకరిస్తున్నట్టు వారు సమాధానమిచ్చారు. ఇలా ఒక్కో జోన్ పరిధిలో ఒక్కో విధంగా కంప్యూటరీకరణ ప్రక్రియ జరుగుతున్నది. పైగా కొన్నిచోట్ల కాలేజీ విద్యార్థులకు ఇస్తే వారు తమ ఫోన్లలోనే వివరాలను నమోదు చేస్తుండటం గమనార్హం.

కమిషనర్ చెప్పేదొకటి.. జరిగింది మరొకటి

డాటా ఎంట్రీ కోసం టీఎస్‌టీఎస్‌కు లేఖ రాసి.. వారు సూచించిన 9 ఏజెన్సీలను నియమించుకొని పారదర్శకంగా దరఖాస్తు వివరాలను అప్‌లోడ్ చేస్తున్నామని కమిషనర్ రొనాల్డ్ రోస్ చెప్తున్నారు. ఎక్కడికక్కడ జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కంప్యూటరీకరిస్తున్న ట్యాక్స్ వాల్యూయేషన్ ఆఫీసర్ ఎం. మహేందర్‌పై వేటు వేసి, అసలు కారణమైన డీసీ వ్యవహారంలో మాత్రం పట్టనట్టు ఉండటం విమర్శలకు తావిస్తున్నది. కుత్బుల్లాపూర్ సర్కిల్-25లో టీం లీడర్‌గా ఉన్న భార్గవ నారాయణకు నోటీసులతో సరిపెట్టారు. ఒకే రోజు వరుసగా అధికారులను బాధ్యులను చేసి వేటు వేస్తే ఎక్కడ తమ లోపాలు ఒప్పుకోవాల్సి వస్తుందోనని అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్న చర్చ జరుగుతున్నది.

డాటా వ్యాప్తికి అడ్డేది?

నిత్యం ప్రతి ఒక్కరికీ వివిధ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ సంస్థలు, ఇలా అనేక వ్యాపార సంస్థల నుంచి ఫోన్లు వస్తుంటాయి. వారికి మన ఫోన్ నంబర్ ఎలా వెళ్లిందో కూడా తెలియని అయోమయ పరిస్థితి. ఈ క్రమంలో ప్రజాపాలనలో సమర్పించిన దరఖాస్తుల్లో కుటుంబంలోని అందరి ఆధార్ నంబర్లతోపాటు రేషన్ కార్డు వివరాలు, కరెంటు, గ్యాస్ బిల్లులు అనేక వ్యక్తిగత వివరాలను సమర్పించారు. ఇంత సమాచారానికి మార్కెట్లో భారీ డిమాండ్ ఉంటుంది. మరి ఇది సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తే పరిస్థితి ఏమిటని మంగళవారం సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దరఖాస్తులు అత్యధిక శాతం మహిళల పేరు మీదనే ఉన్నాయి. ఇందుకోసం దరఖాస్తు వెంట పాస్‌పోర్టు సైజు ఫొటోలు కూడా అంటించారు. దీంతో సైబర్ నేరగాళ్ల చేతిల్లోకి ఇవిపోతే పరిస్థితి ఏమిటనేది కూడా అధికారులుగానీ, ప్రభుత్వంగానీ ఆలోచించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజల ఆస్తుల వివరాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. వాస్తవానికి కుటుంబ సభ్యులకు మనం వివరాలు ఇచ్చేందుకు కూడా ఇష్టపడం. అలాంటిది ఇప్పుడు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వివరాలు చేరిపోయాయి.

- ధరణి పోర్టల్‌పై సీఎం రేవంత్
గతంలో చేసిన వ్యాఖ్యలు

ప్రజా పాలన దరఖాస్తుల కంప్యూటరీకరణను కాంగ్రెస్ సర్కారు ప్రైవేట్ ఏజెన్సీల చేతిలో పెట్టింది. ఆరు గ్యారెంటీల కోసం ప్రజలు ఆధార్, రేషన్ కార్డులు, ఇతర రక్తా డాక్యుమెంట్లతోసహా అప్లికేషన్ పెట్టుకుంటే అవి ఫ్లైఓవర్‌పై గాల్లో తేలాయి. శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు నిన్నటివరకు నీతులు చెప్పిన వారి పాలనలో యథేచ్ఛగా తమ వ్యక్తిగత వివరాలు ఎవరి చేతుల్లో పడితే వారి చేతుల్లోకి వెళ్తున్నాయనే ఆందోళన ప్రజల్లో నెలకొన్నది. ప్రభుత్వం మాత్రం ఈ ఘటనకు బాధ్యులుగా ఓ ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసి, తమ తప్పు లేదన్నట్టు ప్రజలను నమ్మించాలని చూస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సైబర్‌క్రైమ్‌కు తలుపులు తెరిచినట్టే!

ప్రజాపాలనలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల్లోని వివరాలు సైబర్ నేరగాళ్లకు చిక్కితే పెనుప్రమాదమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దరఖాస్తుల్లో ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లు పెట్టారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఇవి వెళ్తే ఆ వివరాలతో సిమ్‌కార్డులు తీసుకొని సైబర్ క్రైమ్ చేసే అవకాశం ఉంటుందని, ఓటీపీ ఆధారిత నేరాలు పెరిగే ప్రమాదం ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. దరఖాస్తులు మహిళల పేర్లతో సమర్పించడం.. వారి ఫొటోలతో పాటు ఫోన్ నంబర్లు పొందుపర్చడంతో వారు లైంగిక వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు.

ఉలిక్కిపడ్డ జీహెచ్ఎంసీ!

- **'రోడ్డుపై దరఖాస్తులు' పై సీరియస్**
- **ఒక అధికారిపై వేటు.. మరొకరికి నోటీసు**
- **సమగ్ర విచారణ: జడ్‌సీ**
- **తీవ్రప్రకంపనలు రేపిన 'నమస్తే తెలంగాణ' కథనం**

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): అభయహస్తం దరఖాస్తులు నడిరోడ్డుపై దర్శనమివ్వడం.. డాటా ఎంట్రీలో అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'రోడ్డెక్కిన ప్రజాపాలన' శీర్షికన వెలువడిన కథనం జీహెచ్ఎంసీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీలో అసలు ఏం జరుగుతుందో అని అటు ప్రజలు, ఇటు అధికార వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై నెటిజన్లు తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. దీంతో దరఖాస్తుల రోడ్డున పడేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొన్నది. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఉదయమే జోనల్ కమిషనర్లతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్ వ్యవహారంపై జోనల్ కమిషనర్ పంకజ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఖైరతాబాద్ జోన్‌లో డాటా ఎంట్రీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇదే సమయంలో అభయహస్తం దరఖాస్తులు బయటకు వెళ్లడం పట్ల జోనల్ కమిషనర్లను కమిషనర్ మందలించినట్టు తెలిసింది. బాలానగర్ ఫ్లై ఓవర్‌పై దరఖాస్తులు పడటం, దరఖాస్తుల ట్రాన్స్‌పోర్టు విషయంలో నిర్లక్ష్యం వహించిన సర్కిల్-3కి చెందిన టీం లీడర్ వాల్యూయేషన్ ఆఫీసర్ ఎం.మహేందర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. అయితే, అసలు బాధ్యులైన డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై పూర్తి విచారణ జరుగుతున్నదని, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రణజిత్‌తో విచారణ జరిపిస్తున్నామని, 24 గంటల్లో నివేదిక రాగానే తగిన చర్యలకు కమిషనర్‌కు నివేదిస్తామని జోనల్ కమిషనర్ పంకజ తెలుపడం గమనార్హం.

టీం లీడర్‌కు నోటీసులతో సరి!

కుత్బుల్లాపూర్ సర్కిల్ 25కి చెందిన దరఖాస్తులను మంగళవారం డాటా ఎంట్రీ ఆపరేటర్లు తమ స్వంత వాహనంలో ఇంటికి తరలిస్తున్న అంశంలోనూ జోనల్ కమిషనర్ పంకజ స్పందించారు. అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ భార్గవ నారాయణ (టీం లీడర్)కు నోటీసులు జారీ చేశారు. అయితే, దరఖాస్తులను ఇంటికి తీసుకెళ్తున్నామని బహిరంగంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు చెప్పినా సదరు టీం లీడర్‌కు కేవలం నోటీసులతోనే సరిపెట్టడం పట్ల తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వివాదాస్పద అధికారిగా ముద్రపడ్డ భార్గవ నారాయణ జీహెచ్ఎంసీలో హాట్ టాపిక్‌గా మారారు. మాతృసంస్థకు పంపించాల్సిన సమయంలోనే కేవలం జీహెచ్ఎంసీలోనే ఆయనను ఇతర చోటుకు బదిలీ చేయడం, తాజా ఘటనలోనూ నోటీసుకే పరిమితం చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, రోడ్డెక్కిన ప్రజాపాలన ఘటనపై సీఎంవో కార్యాలయం ఆరా తీసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కమిషనర్ రోనాల్డ్‌రోస్ సెక్రటేరియట్‌కు వెళ్లగా అక్కడ ఈ అంశంపై చర్చ వచ్చినట్టు సమాచారం. ప్రజాపాలన దరఖాస్తులపై పెద్ద రచ్చ జరగడంతో మొత్తంగా డాటా ఎంట్రీలో సర్కారు ముమ్ముదు ఏ విధంగా వ్యవహరిస్తుందో అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కుత్బుల్లాపూర్‌లోనూ 'ప్రైవేటు' పాలన

- **రెండోరోజూ అధికారులది అదేతీరు**
- **ఇండ్లకు పంపించి డాటాఎంట్రీ**
- **విద్యార్థులతో అప్లికేషన్ల ఆన్‌లైన్**

కుత్బుల్లాపూర్, జనవరి 9: ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల కోసం ప్రజలనుంచి తీసుకున్న దరఖాస్తులకు గ్యారెంటీ లేకుండా పోయింది. దరఖాస్తుల డాటాఎంట్రీ విషయంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఓ ప్రైవేటువ్యక్తి చేతికి ఇచ్చి పంపిస్తుండగా బాలానగర్ ఫ్లైఓవర్‌పై పడి దరఖాస్తులు చెల్లాచెదురు అయిన ఘటనను మర్చిపోకముందే మంగళవారం కుత్బుల్లాపూర్‌లోనూ అలాంటి ఘటనే జరిగింది. అధికారులు ఓ ప్రైవేటు వ్యక్తికి 200కుపైగా దరఖాస్తులు ఇచ్చి పంపడం కలకలం రేపింది. అతడు దరఖాస్తులను పట్టుకెళ్లడం చూసి వాటిని ఎక్కడికి తీసుకెళ్తున్నావని ప్రశ్నిస్తే అప్లికేషన్లను ఆన్‌లైన్ చేసేందుకు ఇంటికి తీసుకెళ్తున్నాని చెప్పడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నరసింహను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. కుత్బుల్లాపూర్ మునిసిపల్ కార్యాలయం ఆవరణతోపాటు ఆయా వార్డు కార్యాలయాల్లో జరుగుతున్న డాటాఎంట్రీ పనుల్లో విద్యార్థులను నియమించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'ధరణి' అధ్యయనంపై కమిటీ

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌పై అధ్యయనానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. కాంగ్రెస్ అనుబంధ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బీ మధుసూదన్ ఈ కమిటీలో ఉన్నారు. దీనికి సీసీఎల్ఏ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. పోర్టల్‌కు సంబంధించిన సమస్యల అధ్యయనం, పరిష్కారం కోసం కమిటీని నియమిస్తున్నట్టు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు, కలెక్టర్లు ఈ కమిటీకి సహకరించాలని సూచించారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

గార్ల, జనవరి 9: అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుల్లూరులో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన చాపల వెంకన్న (33) బీటెక్ వరకు చదివాడు. గత ఏడాది తనకున్న అర ఎకరంతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి తోట సాగు చేశాడు. పంటకు తెగుళ్లు సోకడంతో ఆశించిన దిగుబడి రాలేదు. ఫలితంగా రూ.6 లక్షల వరకు అప్పులయ్యాయి. మనస్తాపానికి గురైన వెంకన్న సోమవారం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకన్న ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతకగా మంగళవారం బావిలో మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

'రాయలసీమ'ను అడ్డుకోవాలి

- **పర్మిషన్ లేకుండా లిఫ్ట్ నిర్మాణం**
- **కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కన్నెత్తి చూడని ఆంధ్రప్రదేశ్**
- **జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

మహబూబ్‌నగర్, జనవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సంగమేశ్వరం వద్ద పర్మిషన్ లేకుండా ఏపీ ప్రభుత్వం చేపడుతుంటే నాటి సీఎం కేసీఆర్ అడ్డుకున్నారని, ఇప్పుడు ఇదే జిల్లా నుంచి సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలను అడ్డుకోవాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంగళవారం కవిత విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే మొదట నష్టపోయేది పాలమూరు జిల్లానే అని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న పదేండ్లు ప్రాజెక్టును కట్టేందుకు ఏపీ ప్రభుత్వం ధైర్యం చేయలేదని చెప్పారు. ఈ ఎత్తిపోతలకు కొద్ది దూరంలోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల(పీఆర్ఎల్ఐ)ను నిర్మించామని అన్నారు. 90 శాతం పూర్తయిన ఈ ప్రాజెక్టుకు రీటెండరింగ్‌ను కట్టిపెట్టి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. టెండర్లను ఎందుకు రద్దు చేయాలనుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రాజెక్టు పరిస్థితి 'ఏనుగు ఎల్లింది.. తోక చిక్కింది' అన్నట్టు ఉన్నదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హామీల అమలుకు, ప్రజల హక్కులను సాధనకు బీఆర్ఎస్ పార్టీ పోరా టం చేస్తూనే ఉంటుందని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనవరి 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను ఇప్పటివరకు పంపిణీ చేయలేదన్నారు.

మాపై కోపంతో అభివృద్ధిని ఆపుతారా..?: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ సర్కారు తమపై కోపంతో జిల్లా కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న దవాఖాన పనులు నిలిపివేశారని తెలిపారు. మన్యంకొండలో మండపాలు కూడా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, నేతలు కృష్ణమోహన్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలను కొనసాగించాలి

సిద్దిపేట జడ్పీ సర్వసభ్య సమావేశం తీర్మానం

సిద్దిపేట అర్బన్, జనవరి 9: కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు కొనసాగించడంతోపాటు మంజూరు చేసిన నిధులకు సంబంధించి పనులు పూర్తిచేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని సిద్దిపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతు రుణమాఫీ పథకాలను వెంటనే అమలు చేయడంతోపాటు జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయాలని, దళితబంధు, గృహలక్ష్మి, రెండో విడత గొర్రెల పంపిణీ పథకాలను యథావిధిగా కొనసాగించాలని, బీఆర్ఎస్ సభ్యులు ప్రతిపాదించగా సభ ఆమోదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని, రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట జడ్పీ సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం

సభ్యుల మధ్య వాగ్వాదం..

రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం లేదని ఓ సభ్యుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్ సభ్యుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫిబ్రవరి వరకు రైతుబంధు వేసిందని చెప్పడంతో.. బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.20, రూ.30 తమ ప్రభుత్వం ఏనాడూ వేయలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే డిసెంబర్ తొమ్మిదవ తేదీనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఎందుకు చేయలేదని సభ్యులు నిలదీశారు. దీంతో కాసేపు సభలో వాగ్వాదం, గందరగోళం చోటుచేసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లో ఉచిత బస్సు పథకం తప్ప ఏ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. రాబోయే రోజుల్లో ఎలా అమలు చేస్తారో చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు.

25 లక్షలు ఇవ్వు.. లేదంటే సీఎంకు ఫైల్

- **అధికారిని బెదిరించిన ముగ్గురి నిందితుల అరెస్టు**

ఇల్లందకుంట, జనవరి 9: 'రూ.25 లక్షలు ఇవ్వాలని.. లేకుంటే నీవు అవినీతి అక్రమాలకు పాల్పడినట్టు ఫైల్ తయారు చేసి సీఎంకు పంపిస్తాం' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఓ అధికారిని బెదిరించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పాతర్లపల్లికి చెందిన అబ్బిడి సురేందర్‌రెడ్డి, జయశంకర్ జిల్లా గుండ్లకర్తికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేశ్ స్నేహితులు. వీరంతా ఇటీవల హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ అధికారికి ఫోన్ చేసి రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. ఫోన్ కాల్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు జరిపి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు.

సిరిసిల్ల జిల్లా వెంకటాంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

గ్యారెంటీల అమలుకు డ్రామాలెందుకు?

- **కాలయాపనకే ప్రజాపాలన దరఖాస్తులు: ఎంపీ బండి**

వేములవాడ రూరల్, జనవరి 9: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్, క్షేత్రస్థాయి పరిశీలన, కమిటీల పేరిట డ్రామాలడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. ఫిబ్రవరిలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినా పథకాల అమలులో చిత్తశుద్ధి చూపడంలేదని విమర్శించారు. రేషన్‌కార్డు ప్రాతిపదికగా గ్యారెంటీలను వర్తింపజేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వెంకటాంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు.

ప్రజాపాలన దరఖాస్తుకు వెళ్లి వస్తూ..

- **మహిళ అనుమానాస్పద మృతి**

బంజారాహిల్స్, జనవరి 9: ప్రజాపాలనలో దరఖాస్తు చేసేందుకు సొంతూరుకు వెళ్లి వచ్చిన మహిళ అనుమానాస్పదస్థితిలో మరణించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వనపర్తి జిల్లా తాడిపర్తికి చెందిన బోయిని అలివేలమ్మ (52) కొన్నేండ్లుగా యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో భర్త వెంకటయ్య, కొడుకు సాయికుమార్‌తో కలిసి ఉంటున్నది. ప్రజాపాలనలో రేషన్‌కార్డు దరఖాస్తు కోసం ఈ నెల 5న సొంతూరుకు వెళ్లింది. ఈ నెల 6న సాయంత్రం బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరింది. హైదర్‌గూడలో ఉండే కుమార్తె అరుణ వద్దకు వెళ్లాలని రాత్రి 8.30కు ఆరాంఘర్ వద్ద బస్సు దిగిన అలివేలమ్మ ఆ తర్వాత కనిపించకుండాపోయింది. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులంతా వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో ఈ నెల 7న ఠాణాలో ఫిర్యాదు చేశారు. సోమవారం కమలాపురి కాలనీలో మహిళ మృతదేహం ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి, అలివేలమ్మ కొడుక్కి సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చూసిన సాయికుమార్ అది తన తల్లిదేనని చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.